# రామనాథం



ఫోను పెట్టేసి నిర్ఘాంతపోయి నోరు తెరుచుకొని చూస్తూ కూర్చుండిపోయాడు రామనాథం.

ఆఫీసుగది షట్టర్లమీద ఎవరో వేలితో టక టక కొట్టారు. రామనాథం ఈ దృష్టిలో లేడు ఏమీ అనలేదు. తలుపులు తోసుకొని నిన్నటిరోజున మాట్లాడి వెళ్ళిన బుర్రమీసాలాయనే నవ్వుకొంటూ వచ్చాడు.

హస్తాభినయంతో ఫోను చూపిస్తూ "ఫోను వచ్చిందిగా మీకూ? . . . అదేమిటి అలా చూస్తారు? ఇప్పుడు ఫోను రాలా మీకు మంత్రిగారి ఆఫీసు నించి?" నవ్వాడు.

రామనాథం ఈ లోకంలోకి వచ్చాడు.

"నేను రేపు కలుస్తానండి ఇంటి దగ్గర. సెలవిప్పించండి." అక్కడ ఉంచిన గొడుగు తీసుకొని రామనాథం అంగీకారం కోసం చూశాడు.

"ఆ" అన్నాడు రామనాథం తను ఏమంటున్నాడో తెలీకుండానే.

బుర్రమీసాలాయన వెళ్ళిపోయాడు.

రామనాథం గుటకలు మింగి వెనకటి సంగతులు జ్ఞాపకం తెచ్చుకొంటున్నాడు ప్రయత్నపూర్వకంగా.

* * *

రామనాథం గెజెటెడ్ ఆఫీసరయిన తరవాత ఒకళ్ళేమిటి అనేకమంది అనేక విషయాల్లో అనేకసార్లు అతని దగ్గిరికి వచ్చి కష్టసుఖాలు చెప్పుకొన్నారు. అన్నింటినీ సానుభూతితో వినేవాడు రామనాథం, ప్రభుత్వోద్యోగికి ఉండవలసిన ప్రధాన యోగ్యత సానుభూతే గనక.

అయితే "ఇలా చేస్తా"నని ఎవరికీ వాగ్దానం ఇవ్వటం గాని లేదా చెయ్యనని చెప్పటంగాని ఎవరూ ఎరగరు.

"అలాగేనండి చూస్తాను" అనేవాడు. "ఫైలు నా దగ్గిరికి రాదండీ" అనేవాడు. "ఫైలు పంపించేశానండీ. పై ఆఫీసర్ని చూడండి" అనేవాడు. అప్పుడు వచ్చినవాళ్ళు తప్పనిసరిగా పై ఆఫీసరును చూడడానికి వెళ్ళేవాళ్ళు.

నిన్న వచ్చిన బుర్రమీసాలాయన అలా వదలలేదు. "అలా అనకండి. మా కేసు మీకింకా చెప్పుకొంటేనే కాని మాకు తృప్తి లేదు. ఇక్కడకాదు. మీ ఇంటి నంబరు చెప్పండి. తాపీగా అన్నీ మీకు వివరంగా చెప్పుకొంటాను" అన్నాడు.

ఇల్లు వదిలి ఆఫీసుకు వచ్చింతరవాత ఆఫీసు ఫైళ్ళల్లో బుర్రదూర్చి ఇంటి విషయాలనుంచి తప్పించుకొనే రామనాథం ఆఫీసు వ్యవహారాలు ఇంటికి తీసికొని పోవటమనేటప్పటికి గతుక్కుమన్నాడు.

"వీల్లే"దన్నాడు.

బుర్రమీసాలాయన వదలలేదు. ఇంటికి వచ్చి తీరాలంటాడు.

అయిదు గంటలయింతరవాత ఆఫీసు వ్యవహారాలన్నీ బుర్రలోనుంచి కోల్పోవటం అలవాటు చేసుకున్న రామనాథానికి, ఈయనెవరో వచ్చి ఆఫీసులో ఇల్లు

కామరాజుగడ్డ రామచంద్రరావు

జ్ఞాపకం చేసి, ఇంటికి వచ్చి ఆఫీసు విషయం ప్రస్తావిస్తానటం అదేమో ఢోంకతిరుగుడుగా అనుపడ్డది.

ఆ మీసాలాయన తన ప్రయత్నం విరమించుకోలేదు.

"చూడండి. ఇంకో విషయం. చెప్పకపోవటమెందుకు మీకు! ఈ కేసుతో మంత్రిగారు ఇంటరెస్టెడు. విన్నారా? ఇక మీ ఇష్టం. అందుకని నేను మనవి చేసుకొనే దేమిటంటే రేపు ఆదివారం మీ ఇంటికి వస్తా. మీకన్ని విషయాలూ చెబుతా. మీరు వినండి. విని న్యాయంగా చెయ్యండి. అన్యాయం వద్దు. మనకేసు స్ట్రాంగ్‌గా రాయండి" అన్నాడు చేతులు తిప్పుకొంటూ.

"చసేమిరా వీల్లేదు" అన్నాడు రామనాథం.

అనాటికి బుర్రమీసాలాయన వెళ్ళిపోయాడు.

ఇవాళ ఈ ఫోను మంత్రిగారి ఆఫీసునుంచే రావటం, వెంటనే ఈ ప్రబుద్ధుడి తెలివితేటల ప్రదర్శనం —మొత్తంమీద "ఆ" అనిపించుకొని వెళ్ళిపోయాడు. ఉమురుద్దుడు.

ఇదేదో తప్పకుండా ఢోంక తిరుగుడేననుకొన్నాడు రామనాథం.

ఢోంకతిరుగుడు వ్యవహారాల మతలబు రామనాథాని కేం కొత్తగాదు. ఆ విషయం చెప్పాలంటే చాలా ఉంది.

* * *

రామనాథం బ్రిటిష్‌వారి హయాంనించీ గుమాస్తాగిరిలో విహరించిన ఘటం.

ఆ రోజుల్లో గుమాస్తా హోదా నిలబెట్టుకోవటం కోసం చొక్కా, కోటు, తలగుడ్డ, ధోవతి, ఉత్తరీయం అన్నీ ధరించేవాడు. అప్పటి ఆకారమే వేరు.

నౌకరు కనక ప్రతిదొరగారి ముందు నమ్రతనెరపి ఫైళ్ళు సమర్పించుకోవటం ప్రధానగుణంగా రాణించేది. బ్రతకటానికి ఎంత బాధపడుతున్నా ఏమీ బాధపడటం లేనట్టే కనబడటం ఆచారమై కూర్చుంది.

కావలసినంత లేమిడి ఇంట్లో లేకపోయినా ఉందను కోవటం మనోలక్షణం కావచ్చు. కాని జీవనం జరిగే దెలాగ? జరక్కపోతే ప్రభుత్వంవారు ప్రమోషన్లు ఇచ్చేవాళ్ళు కాదు. డార్జీలు ప్రేంచేసేవాళ్ళు. ఫలాని వాడికి అప్పులున్నాయి. అందుకని తీసేశామనేవారు.

ఆ స్థితి తలుచుకుంటూనే నవ్వుకొన్నాడు. వేదిక ఎక్కి ఉపన్యాసాలు చెప్పటానికి భయం. జీతం పెంచ మని తయారు చేసిన దొరాదస్తు మీద సంతకం పెట్టటానికే భయం అనిపించిందికి! ఇంకోవిధంగా డబ్బు సంపాదించటం నిషేధం.

ఇంతా చేసి అలాటి శృంఖలాల మధ్య బ్రతకటం తప్పనిసరిగదా! అందుకని తమ వర్గంవాళ్ళంతా ఇతర్ల దయాధర్మభిక్షాలమీద నమ్మకంఉంచి ధనం ఆశించారు.

అయితే మరి అలా భిక్షం పుచ్చుకొన్నట్లు అనుపడ రాదే! ప్రభుత్వం వారిమాట అటుంచి, ప్రపంచానికి! అందుకని ఏదో పనిచేసిపెట్టినట్లూ దానికి మెచ్చి వాళ్ళు రొండిచ్చినట్లూ ఆత్మవంచన చేసుకోవటం మొదలుపెట్టారు.

దాంతో కొంత సహాయం దొరికింది తమకు. ప్రాణాలన్న కోసం బ్రతకవలసిన ఆ అబద్ధపు బ్రతుకు నిరాఘాటంగా సాగించటానికి వీలయింది. రామనాథం మళ్ళీ నవ్వుకొన్నాడు.

ఈ కీలకం గుమాస్తాల మాట అటుంచి రాను రాను ప్రజల్లోకి పాకింది. ప్రభుత్వంలో పని కావలసిన వాడల్లా ఉద్యోగస్థుల దగ్గరికి వచ్చి దేవిరించటం ఏదో ఒకటో రెండో ఎరచూపి మామూలుకంటె త్వరగా పని చేయించుకోటం ప్రారంభించారు.

అలా పని చేయించుకొని వెళ్ళినవాళ్ళు ఊరుకోలేదు, మీసాలు దువ్వి గప్పాలు కొట్టేవాళ్ళు — "ఫలానిపని ఫలాని గంటలో చేయించుకు వస్తాను గవర్నమెంటులో" అంటూ.

తనుకూడా మిగతా గుమాస్తాలందరితోపాటు వాడే అయినా, తన పూర్వజన్మ సంస్కారంవల్లనయితేనేమి, భగవదనుగ్రహంవల్లనయితేనేమి, లేక తన భార్యాపుత్రుల అగచాట్ల కోసరమయితేనేమి, ఈ గప్పాలు తాను వినటం, మనసు మార్చుకోవటం తటస్థించింది.

ఆ గప్పాలేమిటో ఇదమిత్థమని జ్ఞాపకానికి రాలేదు. కాని, వెనకటికి రంగూన్ ఓడలరేవులో పనిచేసే భారతీయ కూలీలను ఇంగ్లీషు కంట్రాక్టర్లు బూటుకాళ్ళతో తన్నితే వాళ్ళు గబగబా లేచి అవతలకు పోతూ తమలోతాము నవ్వుకొనటం చూపించి, అప్పటి గవర్నరుగారు బంగాళీబాబయిన అష్‌తోష్‌తో అన్నాడట — "వీళ్ళకేనా నువ్వు స్వతంత్రం ఇవ్వాలని అంటూవుంటావు?" అని. అప్పటి బంగాళీబాబు పరిస్థితే తనకు కలిగింది ఆ గప్పాలు వినగానే.

తను ఆ బంగాళీబాబంత గొప్పవాడు కాకపోవచ్చు గాక, అయినా అంతే.

అది ఆగస్టు 15వ తేది. 1947వ సంవత్సరమేనేమో కూడా.

ఆనాటితో రామనాథం అబద్ధపు బ్రతుకు బ్రతకటం మానివేశాడు. అతడికిక ఇతర్ల దయాధర్మ భిక్షాలతో సంబంధంలేదు. ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వదేమోననే భయంకూడ పెట్టుకోలేదు. ఎందుకంటే ప్రమోషన్ పుచ్చుకున్న హెడ్ గుమాస్తా —ఆఫీసు విడిస్తే — తనకంటె ఇంకా నీచస్థితిలో ఉండటం నిన్నటివరకూ గమనిస్తూనే ఉన్నాడు గదా!

అందాకా ఎందుకు తన ఆఫీసరే ఒకడు తన కారు వాడితే పెట్రోలు అయిపోతుందని ఇంకో స్నేహితుడి కారులో షికారు వెళటం స్వయంగా ఎరుగును.

రామనాథం అనుకొన్నాడు 'ఈ లేమి అనేది ప్రమోషన్ లేకపోవటాన కాదు. అది మనసులోని స్థితి. అంతే. మహిలోనిదికాదు' అని. అందుకని మనసు మార్చుకొన్నాడు.

ఇంతకూ రామనాథం ఈ బుర్రమీసాలాయన ప్రస్తావించిపోయిన ఫోనుకాల్ సందర్భం అన్వయించుకోవటంలో వెనకటి ఈ చరిత్రంతా నెమరువేసుకొన్నాడు.

అన్న ప్రకారం ఆదివారంనాడు ఆబుర్రమీసాలాయన రామనాథాన్ని ఇంటి దగ్గర కలుసుకొన్నాడు.

రామనాథం చెప్పాడు: "బాబూ, నా జీతం నాకు సమంగా అరగనీయంచి. నేను పిల్లలుగలవాణ్ణి. చేతగాని పనులు నాచేత చేయించవద్దు."

"ఇది మీచేతనయిన పనే. మీకు కావాలంటే మినిస్టరు. . . ."

"నాకు చేతనయిన పని మీరు చేయించవలసిన పని లేదు. మీకేం తోస్తే అది చెయ్యండి. దయచేసి వెళ్ళండి."

". . . . . . . . . ."

"నమస్కారం. వెళ్ళిరండి."

ఆయన కదలలేదు. రూక్షేక్షణాలతో నిలుచున్నాడు.

"ఆ కాగితాలు మీవే. తీసుకోండి. మరిచిపోయేరు గాక. నమస్కారం."

అన్ని మాటలూ వెళ్ళమన్నట్లు గానే ధ్వనించినయి.

వెళ్ళటానికే నిర్ణయించుకొని ఆ ఆసామీ "సరే, మరి. . . దీని ఫలితం మీరే చూద్దురుగాని" అన్నాడు.

తాపీగా "అలాగే" అన్నాడు రామనాథం.

"మినిష్టరు ఇంటరెస్టెడన్నా అంతేనన్నమాట!" తల పంకించి చూసి కదిలి వెళాడు ఆసామీ.

ఇవన్నీ రామనాథాన్ని భయపెట్టలేదు.

* * *

మరునాడు మళ్ళీ ఫోను.


"నేను మంత్రిగారి ఆఫీసునుంచి మాట్లాడుతున్నాను. మీరు లైనులో ఉండండి. మంత్రిగారు మీతో మాట్లాడుతారట!"

నిర్ఘాంతపోయాడు రామనాథం. 'మినిష్టరు తనతోనా మాట్లాడబోయేది! ఇది సంభవమా?'

ఫోనులో మళ్ళీ వినిపించింది. "మీరు ఫోను


ఏజంట్లు కావలెను

సుప్రసిద్ధమైన "ఎనాల్డ" ఆల్ వరల్డ్ పోర్టబుల్



ట్రాన్సిస్టరు అమ్మకము నకు 35% కమిషను మీద ఏజంట్లు కావలెను. వివరములకు కాంపిల్ ట్రాన్సిస్టరుకు వ్రాయండి

JAGEE CO. (WAV 57),
Post Box 1115, Delhi-6.

ఈ నెలవరకు ఉచిత బహుమతి



స్త్రీల సౌందర్యము కాశ్మీర్ ఆరు చీరెలు. ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు, రంగులలో సీజనుకు తాజాగావచ్చినవి. పెద్ద సైజు. మావద్ద మాత్రమే ఉన్నవి. వెల ఒక్క చీరె రు. 11/—లు 2 చీరెలు రు. 20/—లు 3 చీరెలు రు. 28/—లు, 4 చీరెలు రు. 36/—లు, రెండు లేక ఎక్కువచీరెలు ఆర్డరిచ్చిన వారికి ఒక బ్లౌజుముక్క ఉచితం. ఆర్డర్లు పోస్టు పార్శిలుద్వారా పంపబడును

ARVIND AGENCIES (AP-22)
Post Box 1408, Delhi-6.

పెట్టేసి మీ రూమ్‌లోనే ఉండండి. మళ్ళీ పిలుస్తాను. ఆయన వేరే పనిలో ఉన్నారు. . . . మరేం లేదులెండి . . . . ఫలానాయన ఫైలు విషయమే!"

ఫోను పెట్టేశాడు రామనాథం.

ఆ ఫైలు విషయం తనతో మాట్లాడడమెందుకో రామనాథానికి తెలీలేదు. మంత్రిగారు తన దగ్గిరికే ఫైలు తెప్పించుకొని ఒక ఆర్డరు వేయకూడదూ? ఇంతలో ఏమీ తోచక ఊరుకొన్నాడు.

మనసు ఊరుకోలేదు. ఆలోచించటం మొదలయింది.

'ఏమనుకుంటాడు మంత్రిగారు? ఫలానాయన్ని పంపితే ఆయన గొడవెందుకు వినరేమంటాడా?'

బుర్రమీసాలాయనమీద అనర్గళమైన కోపం వచ్చింది. ఒక నిశ్చయానికి వచ్చాడు.

'తను వ్రాయదలచుకొన్నది ధర్మం. ఆ మీసాలాయన అధర్మం చేయించాలని చూస్తున్నాడు. దానికోసమే హేమాహేమీలందర్నీ ఆటలాడిస్తున్నాడు.

పెద్దవ —అధర్మ భూయిష్ఠమైన పని చేయించటం కోసం మనిషయిన ఒకడు ఇంతటి శ్రద్ధ, నిర్భరం, ఫోనులో నాటకం ఆడేటంతటి సాహసం, మనోబలం వెచ్చించి కథ నడప గలుగుతూంటే ధర్మమైన పని చెయ్యటానికి ఎంత సాహసం, ఎంతదీక్ష, ఎంత ఆత్మబలం ప్రజ్వలింపజెయ్యవలసి ఉంటుంది? ఈ స్థితిలో తన కుండవలసిన ఈ అకుంఠిత సద్గుణాల కోసం — పెద్దవ ఈ ఉద్యోగం అవసరమయితే వదిలించుకోవటమనేది ఒక లెక్కలోనిది కాదు. కావాలంటే ఫైలు తెప్పించి వ్రాసుకోనుంటాను.'

ఇంకోపని తోచటంలేదు. మళ్ళీ ఫోను బెల్లు ఎప్పుడు మోగుతుందా అని ఎదురు చూస్తూ ఆలోచిస్తున్నాడు రామనాథం పని మానేసి. మరి మంత్రిగారు ఇదా మాట్లాడబోతున్నది! ఆలోచన ఊరుకోలేదు.

'అవినీతి అవినీతి అని ఒక్క ప్రభుత్వోద్యోగుల్లోనే ఊహించుకోవటం ఎంత వెర్రి! ప్రజల్లో ప్రతి అంగుళం ఇది వ్యాపించి ఉంది. స్వార్థం కోసరం కాకపోతే, అణగద్రొక్కటానికిగాని, వాడి గుణగణాల్ని నిర్వ్యాపారం చేసేవారాలలో నడవడానికిగాని వెనుదీయటం లేదు. ఈ కల్మష భూయిష్ఠమైన ప్రకోపనం ప్రవాహంలా వెళ్ళిపోతుంటే నేను చేయగలిగేదేమైనా ఉందా? ప్రవాహంలో ఎదురుగా నిల్చి కొట్టుకుపోయే గడ్డిపరకలా వెళ్ళిపోవటమేనా?'

మళ్ళీ ఫోనువంక చూశాడు. బెల్లు మోగలేదు.

'అలా కోటు పోవాలనే తను ఒగితే అసలు స్వాతంత్ర్యం వల్ల ప్రయోజనమేమిటి? దాని ప్రయోజనం ప్రకటించానికి పనికొస్తే. అయితే అది మానవుడి ఆత్మోన్నతికి అవసరం. దాన్ని కష్టమైనా సరే సంతరించు పద్ధతుల్ని ప్రబోధింపజేయటం మానవుడి నైజానికి ధర్మం. . . . . .తను ఈ ఉద్యోగం మానేసి ప్రజల్లో నూతన చైతన్యాన్ని తేవటానికి యత్నిస్తే! . . ."

బెల్లు మోగింది ఫోన్‌లో.

రామనాథం రిసీవరు ఎత్తాడు.

అవతల మాట్లాడేది పి.ఎ. నట.

"రామనాథంగారూ, ఆ ఫైలు తీసుకొని మినిష్టరుగారు మిమ్మల్నొకసారి రమ్మన్నారండి."

"అలాగే!" ఫోను పెట్టేశాడు.

'మంత్రిగారు మాట్లాడడం అనేది పట్టి అబద్ధం' అనుకొన్నాడు.

మళ్ళీ మోగింది ఫోను.

"నేనేనండి. ఆ ఫైలులో ఫలానాయనకు 'ఫర్'గా ఆర్డర్సు ఇవాళనే పోవాలెనట! మీరు ఫైలు తేనక్కర్లేదు. అలా నోటు వ్రాసి పంపండి."

ఫోను పెట్టేశాడు రామనాథం.

వెంటనే ఫోనులో తన పై అధికారిని పిలిచి ఫలాని పి. ఎ. ఇలా నోటు వ్రాయమని చెప్పాడని ఫిర్యాదు చేశాడు.

"పి. ఎ. ఎప్పుడు మాట్లాడాడలాగ?" అన్నాడు అధికారి.

"ఇప్పుడే ఒక క్షణం కిందట."

"ఒక్కక్షణం కిందటేనా?" ఒక నవ్వునవ్వి ఫోను పెట్టేశాడు ఆఫీసరు.

రామనాథానికి తికమకపోయింది.

ఫోను రిసీవరు ఎత్తి పి. ఎ.గారి నంబరు తిప్పాడు.

"ఎవరు?"

"నేను పి. సి. నండి."

"పి. ఎ. గారిని మాట్లాడమనండి"

"లేరండి. మీ ఆఫీసరుగారి దగ్గిరికి వెళ్ళారు పిలిస్తే. అరగంటైంది."

రామనాథం ఫోను పెట్టేశాడు. ఏమీ అర్థం కానట్టు చూస్తున్నాడు.

ముందు ఈ గొడవకు సంబంధించిన ఫైలే కనపడుతూంది. ప్యూనోను పిలిచి నోటు చెప్పేశాడు. ఆ నోటు ధర్మబద్ధంగానే వెళ్ళిపోయింది.

కాస్త గాలి పీల్చుకొన్నాడు మనస్సుతో.

తలుపు తోసుకొని బుర్రమీసాలాయన వచ్చాడు.

రామనాథం కూర్చోమనలేదు. ఆయనే కూర్చున్నాడు.

"ఏమిటండీ మీరు వచ్చిన పని?"

"అప్పుడే మరిచిపోయారా? ఇప్పుడేగా మినిష్టరుగారి పి. ఎ. మీకు ఫోను చేసింది!"

"వారు మీకెలా పరిచయమండీ?"

"మంత్రిగారిది మా కాంస్టిట్యుయన్సీయేనండి. తెప్పరి తేస్తే మాతోనే పని ఆయనకు. మేము ఎప్పుడో ఒకసారి ఇలా పనికోసం వస్తాంగాని ఆయన కెప్పుడూ పనే మాతోటి."

గొంతు తగ్గించి మళ్ళీ చెప్పటం ఆరంభించాడు.

"మినిష్టరుగారి బావమరిదిగారు నాకు మరీ దగ్గిరవాడు. నా సొర్వనరనుకోండి. ఇంకెందుకు? మనమంటే గురి. ఎట్లాంటివాడనుకొన్నారు? బలే సమరుడు. ఆయన ఎంతమందికి ఉద్యోగాలు వేయించాడో అంతు లేదు. ఐతే అంతమందిని, అంతకంటే ఎక్కువమందిని డిస్మిస్ చేయించటమేమిటి, ట్రాన్స్‌ఫరు చేయించటమేమిటి అట్లా చేశాడనుకోండి. . . .ఆ . . . .అదీ నేనే చెబుతాగా!" నవ్వాడు.

"ఓహో! అలాగా! మరి మీరు వెళ్ళరండి. మీ ఫైలు ఇవాళనే పంపమన్నారు మినిష్టరుగారు. పంపిస్తున్నాను."

ఆసామీ రొమ్ములు విరుచుకొంటూ సంతోషంతో వెళ్ళాడు.

ప్యూనో ఫైలు తెచ్చాడు. రామనాథం చదివి సంతకం చేసి ట్రేలో వేశాడు.

తిరిగి తెల్లకాగితం తీసి ఉద్యోగానికి రాజీనామా వ్రాశాడు. అదికూడా ఇంకో ఫైలుచేసి పై ఆఫీసరుకు పంపించాడు.

రాజీనామా పెట్టిన రామనాథం ముఖంలో ప్రశాంతి కలిగింది. ఏదో అనిర్వచనీయమైన కళ తిలకించి కూర్చున్నాడు. అయిదు కావటాని కింకా రెండుగంట లుంది.

తను రాజీనామా పంపాడు కనక ఫోనులో ఎవరు పిల్చినా పలకవద్దనుకున్నాడు.

ఆలోచనలతో కాలం జరిగిపోయింది. అయిదు కావచ్చింది.

హఠాత్తుగా ఫోను మోగింది.

అలవాటుకొద్దీ రిసీవరు ఎత్తాడు. మంత్రిగారు మాట్లాడుతున్నారు!

రామనాథానికి చెమటలు పోశాయి. మనసులోని సంఘర్షణ మనిషిమీద కనపడటం మానవ లక్షణం కనక అలా చమటలు పోశాయి.

మంత్రిగారిలా అన్నారు —

"రామనాథంగారూ! మీరు ఇవాళ పంపిన ఫైలు నాకు వచ్చింది. మీరు వ్రాసిన నోటు ఎంతసమంజసంగా ఉందో నేను నోటితో చెప్పలేను. మీరు నోటు అలా వ్రాయకుండా మరోవిధంగా వ్రాసినట్లయితే మిమ్మల్ని నిజానికి అనుమానించవలసి వచ్చేది."

". . . . . . . . . . ."

"ఇలాంటి నోటు మీరు ఇది ఒక్కటే వ్రాశారనీ దానికోసం మిమ్మల్ని కీర్తిస్తున్నాననీ అనుకోవద్దు. చిత్తశుద్ధితో నోటు వ్రాయటం మీ కర్తవ్యం. మిమ్మల్ని దానికోసరం మెచ్చుకోవలసిన అవసరం ప్రపంచంలో ఎవరికీలేదు. ఇప్పుడు నేను మెచ్చుకొంటున్నది నిజానికి మీ నోట్సులోని ప్రత్యేకతకాదు.

"ఈ ఫైలుతోపాటు మీ రాజీనామా ఫైలుకూడ వచ్చింది. మీ అధికారి ఈ రెండు ఒకే కట్టగా పంపాడు నా దగ్గిరికి. మీరు ఆయనకు ఫోను చేసిన విషయం, అప్పుడు పి. ఎ. ఆయన ఎదురుగానే ఉన్న వయినం కూడా ఫైలులో ఆయన వ్రాశాడు. మీ నిశ్చయబుద్ధికి నేను స్వయంగా ఫోను చేసి మెచ్చుకొంటున్నాను. మంత్రిగా కాదు, భారతీయ పౌరుడుగా మెచ్చుకొంటున్నాను.

"తరవాత నా దొక కోరిక కూడా ఉంది. మంత్రిగా కాదన్నాను కదూ. మీలాంటివాళ్ళు నా ప్రభుత్వానికి కావాలి. మీ రాజీనామా ఉపసంహారం చేయండి."

రామనాథం మాటాడలేదు.

"ఏం? ఈ కోరిక అధర్మంగా తోస్తూందా? కాదని నా అభిప్రాయం. దయచేసి ఉపసంహరించుకోండి."

"చిత్తం" అన్నాడు రామనాథం.

రామనాథం రాజీనామా విషయం ఆ విధంగా రాజీ అయింది.

ప్రపంచ సరళి ప్రవాహంలా వెళ్ళిపోతూనే ఉంది! ★